నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 25 జూన్ 2024 | KHAMMAM

జీళ్లచెరువులోని మంచినీటి శుద్ధి ప్రాజెక్టు

తొమ్మిది అడుగులకు పడిపోయిన జలాశయ నీటిమట్టం
మరో 15 రోజులకు మాత్రమే సరిపడేలా ఉన్న తాగునీరు
ఈలోపు వర్షాలు రాకుంటే పరిస్థితి జఠిలమయ్యే ప్రమాదం

పాలేరుకు మళ్లీ నీటిగండం?

ఐదు జిల్లాలకు తాగునీరు అందించే పాలేరు రిజర్వాయర్‌కు మళ్లీ నీటిగండం పొంచి ఉంది. క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 9 అడుగులకు పడిపోయింది. ఈ రిజర్వాయర్ నుంచి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, సూర్యాపేట జిల్లాల్లోని 3,500 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. పాలేరు చరిత్రలోనే లేని విధంగా గత ఏప్రిల్‌లో ఐదు అడుగుల అట్టడుగుస్థాయికి నీటిమట్టం పడిపోయింది. దీంతో జిల్లా యంత్రాంగంతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అప్రమత్తమై సాగర్ డ్యాం నుంచి వారం రోజులపాటు నీటిని విడుదల చేయించారు. ఫలితంగా వేసవి నీటి సమస్య తీరింది. ప్రస్తుతానికి రోజురోజుకూ తగ్గుతున్న నీటిమట్టం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. మరో 15 రోజుల్లో వర్షాలు అందుకొని వరదలు రాకపోతే మరోసారి తాగునీటి సమస్య జఠిలమయ్యే ప్రమాదం లేకపోలేదు.

9 అడుగుల వద్ద పాలేరు నీటిమట్టం

కూసుమంచి, జూన్ 24: మిషన్ భగీరథ ద్వారా సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లోని కొంతభాగం గ్రామాలకు తాగునీటిని అందిస్తున్న పాలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు మరో 15 రోజుల వరకు మాత్రమే సరిపోయేలా ఉన్నాయి. ఇటీవలి మార్చి నుంచి ఏప్రిల్ వరకు మిషన్ భగీరథ తాగునీటి విషయంలో హై అలర్ట్ ప్రకటించి జిల్లా యంత్రాంగం.. మొత్తం పాలేరులో మకాం వేసి రేయింబవళ్లూ పర్యవేక్షించారు. ఏప్రిల్, మే నెలల్లో అప్పటికే నిల్వ ఉన్న నీటిని రెండు లేదా మూడు తడులకు సాగునీరుగా ఇవ్వాలని ఓవైపు రైతులు, తాగునీటికే ఇవ్వాలని మరోవైపు ప్రజలు కోరడం వంటివి చోటుచేసుకున్నాయి. సరిపోయే నీళ్లు లేని పరిస్థితుల్లో 20 రోజులపాటు ఇక్కడ సమస్య రాష్ట్ర సమస్యగా మారిన విషయం విదితమే. ఎట్టకేలకు మంత్రులు పొంగులేటి, తుమ్మల చొరవతో సాగర్ నుంచి జలాలు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ నీరు చౌర్యం కాకుండా నెల రోజులపాటు అధికారులు గస్తీ కూడా ఏర్పాటు చేశారు. గత ఏప్రిల్ 4 నుంచి 10 రోజులపాటు సాగర్ నుంచి నీరు రావడంతో పాలేరు నీటిమట్టం 5 అడుగుల నుంచి 18.5 అడుగులకు చేరింది. ఇప్పటి వరకూ ఆ నీటిని తాగునీటి అవసరాల కోసం వినియోగించారు. దీంతో ఇప్పటికి పాలేరు నీటిమట్టం 9 అడుగులకు పడిపోయింది. ప్రస్తుతం జూన్ నాలుగో వారంలోకి అడుగు పెడుతున్నా ఇంకా ఆశించిన మేర వర్షాలు రాకపోవడంతో పాలేరుకు వరద రాలేదు. ఎగువన సాగర్ పరిస్థితీ గడ్డుగానే ఉంది. ఈ తరుణంలో మళ్లీ మరో 15 రోజుల్లో పాలేరు డెడ్ స్టోరేజీకి చేరుకునే ప్రమాదముంది. ముందస్తుగా అప్రమత్తం కాకపోతే సమస్య మళ్లీ తీవ్రరూపం దాల్చనున్నది.

వర్షాలపైనే భారం..

సాగర్‌లో డ్యాం పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి అవసరాల కోసం మరోసారి 3 టీఎంసీల వరకు విడుదల చేసే అవకాశముంది. కానీ.. సాగునీటి సరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వర్షాకాలం మొదలైనప్పటికీ చెదురుమదురు జల్లులు మినహా పెద్ద వర్షాలు కురవలేదు. దీంతో పాలేరు నిండలేదు. ఫలితంగా ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు మళ్లీ వర్షాల కోసమే చూస్తున్నారు. పాలేరు ఇన్‌టేక్‌వెల్ తీసుకొంటున్న నీరు క్రమంగా తగ్గుతోంది. మిషన్ భగీరథ అవసరాల కోసం రోజుకు 130 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. దీంతో రోజుకు 0.15 నుంచి 0.20 అడుగుల వరకు నీటి మట్టం తగ్గుతోంది.

కేఆర్‌ఎంబీ పరిధిలోకి పోవడంతో కష్టాలు..

గతంలో సాగర్ జలాల వినియోగం విషయంలో తెలుగు రాష్ట్రాల్లో కొంత వెసులుబాటు ఉండేది. కానీ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ) పరిధిలోకి వెళ్లింది. దీంతో సాగర్ జలాల వినియోగం విషయంలో తెలుగు రాష్ట్రాలకు గతంలో ఉన్న అధికారాలు లేకుండాపోయాయి. దిగువ జలాశయాల కింద ఉన్న ప్రజల గొంతులు ఎండుతున్నా, పంటలు ఎండిపోతున్నా కేఆర్‌ఎంబీ నిర్ణయం మేరకే సాగర్ నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి ఏర్పడింది. దీంతో పాలేరు పరిధిలో తాగునీటికి, సాగునీటికి అవరోధాలు ఏర్పడుతున్నాయి.

ప్రజలకు అండగా ఉందాం..

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం..

'పేట' మాజీ ఎమ్మెల్యే మెచ్చాతో మాజీ సీఎం కేసీఆర్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట, జూన్ 24 : రాష్ట్ర ప్రజలకు అండగా ఉందామని, ఇబ్బందులు ఎదుర్కొంటున్న పార్టీ శ్రేణులకు కూడా భరోసాగా నిలుద్దామని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. అదే క్రమంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కూడా ఎండగడదామని అన్నారు. కాంగ్రెస్ కూడా అమలు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిందని, అనతి కాలంలోనే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందని, కేవలం అధికారం కోసం ప్రజలను మోసం చేసిందని స్పష్టం చేశారు. అధికారం లేకున్నా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని అన్నారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు.. ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత వ్యవసాయక్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుందని అన్నారు. స్వరాష్ట్ర అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమనే నమ్మకం ఎక్కువ మంది ప్రజల్లో కన్పిస్తోందని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వంలో సాధించిన ప్రగతి, దాని ఫలాల గురించి మెచ్చాను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. అయితే కేసీఆర్ పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి కేసీఆర్‌కు మెచ్చా వివరించారు. అయితే, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో నష్టం జరిగిందని కేసీఆర్ పేర్కొన్నట్లు 'మెచ్చా' నమస్తే తెలంగాణకు తెలిపారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య

అభిషేక్ అగస్త్య

రఘునాథపాలెం, జూన్ 24 : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న అభిషేక్ అగస్త్యను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా 2021, అక్టోబర్ 20వ తేదీ నుంచి పని చేసిన ఆదర్శ్ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో ప్రభుత్వం అభిషేక్ అగస్త్యను కమిషనర్‌గా నియమించింది. జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని జమ్మూ జిల్లా ఆర్ఎస్ పురానికి చెందిన అగస్త్య.. అక్కడే ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తి చేశారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్‌ను శ్రీనగర్ ఐఐటీలో పూర్తి చేశారు. సోదరుడు ఐఎఫ్ఎస్ అధికారి సర్జిత్ స్ఫూర్తితో సివిల్స్‌కు ప్రిపేర్ అయి 2018 సంవత్సరంలో అఖిల భారత స్థాయిలో 38వ ర్యాంకు సాధించారు. శిక్షణ అనంతరం తెలంగాణ క్యాడర్‌కు కేటాయించగా.. మేడ్చల్ మల్కాజ్‌గిరి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పని చేశారు. తల్లిదండ్రులు విద్యా వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై రానున్నారు.

భద్రాచలం ఐటీడీఏ పీవోగా రాహుల్

రాహుల్

భద్రాచలం, జూన్ 24 : మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.రాహుల్‌ను భద్రాచలం ఐటీడీఏ పీవోగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పీవోగా పనిచేసిన ప్రతీక్ జైన్‌కు ఉద్యోగోన్నతి కల్పిస్తూ వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. దీంతో ఇన్‌చార్జి పీవోగా భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. అయితే మంచిర్యాల అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) రాహుల్ ఐఏఎస్‌ను భద్రాచలం ఐటీడీఏ పీవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే ఆయన పీవోగా బాధ్యతలు స్వీకరిస్తారని ఐటీడీఏ అధికారులు తెలిపారు.

రూ.124.48 కోట్లతో తాగునీటి పథకం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, జూన్ 24 : జిల్లా ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.124.48 కోట్ల సంయుక్త నిధులతో తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి కోసం కొత్తగూడెం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా ఆలోచించి పథకానికి రూపకల్పన చేశామన్నారు. కిన్నెరసాని నుంచి కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధితోపాటు ఇతర ప్రాంతాలకు 159 కిలోమీటర్ల మేర నూతన పైపులైన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకయ్యే ఖర్చులో 60 శాతం కేంద్ర, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం మున్సిపల్ నిధులు వెచ్చిస్తారన్నారు. పథకంలో భాగంగా ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద 2.65 లక్షల లీటర్ల నీటిని ప్రతిరోజు శుద్ధి చేసి ఆ నీటిని హైలెవల్ ట్యాంకులకు సరఫరా చేసి అక్కడి నుంచి ఇంటింటికి సరఫరా చేస్తారన్నారు. ఈ పథకానికి ఈ నెల 27న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

అలాగే సింగరేణి, కేటీపీఎస్, సీఎస్ఆర్ స్కీం నిధులు సక్రమంగా విడుదలయ్యేలా చూసి పాల్వంచతోపాటు కొత్తగూడెంలోని అన్ని ప్రాంతాలకు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్ చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని, దీనిపై అధ్యయనం జరుగుతోందన్నారు. ఎయిర్‌పోర్టు విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కౌన్సిలర్ కూరపాటి విజయలక్ష్మి, సత్యభామ, సత్యావతి, వేముల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

- అధికారంలోకి వచ్చి ఆర్నెల్లయినా హామీల మాట ఎత్తట్లేదు
- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

కమాన్‌బజార్, జూన్ 24: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీహెచ్ సీతామహాలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు నరసింహారావు, సీతామహాలక్ష్మి మాట్లాడుతూ.. జీవో నెంబర్ 10 రద్దు కోసం గత ఏడాది 24 రోజులపాటు అంగన్‌వాడీలు సమ్మె చేశారని గుర్తుచేశారు. ఆ సమయంలో సెప్టెంబర్ 11న కాంగ్రెస్ నాయకులు తమ సమ్మె శిబిరం వద్దకు వచ్చారని, తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. కానీ వారు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ఇంకా ఆ హామీల మాట ఎత్తడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీలనూ అంగన్‌వాడీలకు అమలుచేయాలని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు.విజయకుమారి, హస్నాబీ, సునీత, శ్రీదేవి, మరియమ్మ, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

సారూ.. మీరన్నా తీర్చాలి

- ప్రజావాణికి పోటెత్తిన ప్రజలు
- సాయంత్రం వరకు వినతులు స్వీకరించిన కొత్త కలెక్టర్

ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డేగలమడుగు రైతు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : సారూ మా సమస్యలను మీరన్నా తీర్చాలంటూ ప్రజావాణిలో ప్రజలు కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి జనం పోటెత్తారు. కొత్తగా వచ్చిన కలెక్టర్ ప్రతిఒక్కరి సమస్యను విని, వాటికి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి సమస్యను సమయం తీసుకుని వినడంతో ప్రజావాణి సాయంత్రం వరకు కొనసాగింది. సమస్యలపై వెంటనే విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు మధు, దామోదర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జూలై 3వరకు ప్రత్యేక క్యాంపులు

సికిల్ సెల్ అనీమియా వ్యాధిని శాశ్వతంగా నివారించేందుకు ఈ నెల 19 నుంచి జూలై 3వ తేదీ వరకు ట్రైబల్ ఏరియాలోని గిరిజనులకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రెటరీ జయ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి ఆమె జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఆదివాసీ గిరిజనులకు సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి తప్పనిసరిగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే తప్పనిసరిగా చికిత్స అందించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 50 ఆశ్రమ పాఠశాలలు, 23 పీఎంహెచ్ హాస్టళ్లు, 30 వసతిగృహాల్లోని గిరిజన విద్యార్థులకు, ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ప్రజలకు టెస్టులు నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్, డీపీవో చంద్రమౌళి, అదనపు డీఆర్‌డీవో రవి, జిల్లా ఉపాధి కల్పనాధికారి విజేత పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. వీవీ ప్యాడ్స్‌లో స్లిప్పుల తొలగింపు, అడ్రస్ బాక్స్, థర్మల్ పేపర్స్ రిమూవల్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈవీఎం, వీవీ ప్యాట్ నిల్వ ఉంచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్ట భద్రత కొనసాగించాలని సూచించారు. గోడౌన్ పక్కన ఉన్న పాత బిల్డింగ్‌ను పూర్తిగా తొలగించి ఆ ప్రదేశంలో ఎన్నికల ప్రక్రియ సమయంలో కావాల్సిన షెడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట ఎన్నికల విభాగం అధికారులు దారా ప్రసాద్, రంగ ప్రసాద్, తహసీల్దార్ పుల్లయ్య ఉన్నారు.

ఐటీడీఏలో దరఖాస్తుల స్వీకరణ

భద్రాచలం, జూన్ 24 : వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన గిరిజనులు తమ సమస్యలపై భద్రాచలం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్‌కు సోమవారం దరఖాస్తులు సమర్పించారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఇన్‌చార్జి పీవో జితేశ్ వి పాటిల్ ఆదేశాల మేరకు గిరిజనుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. తన పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తూ.. మిగతా వాటిని యూనిట్ అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా పోడు భూములు, వ్యక్తిగత, భూ సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాల కొరకు, పట్టా భూములకు రైతుబంధు తదితర అంశాలకు సంబంధించిన వాటిపై దరఖాస్తులు సమర్పించినట్లు తెలిపారు. వీటిని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఒంటరి, వితంతు మహిళ పింఛన్ల కోసం, కులాంతర వివాహాలకు సంబంధించిన ప్రోత్సాహకాల కోసం గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈతః ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, గురుకుల ఆర్సీ వెంకటేశ్వరరాజు, ఏపీవో పవర్ మునీర్‌పాషా, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, జేడీఎం హరికృష్ణ, ఇతర యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

వినతులు స్వీకరిస్తున్న ఖమ్మం అదనపు కలెక్టర్

మామిళ్లగూడెం, జూన్ 24 : ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి, త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను పరిష్కార నిమిత్తం ఆదేశిస్తూ సంబంధితశాఖల అధికారులకు అందజేశారు. అనంతరం అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సీఎంవో ప్రజావాణి దరఖాస్తులు జిల్లాలో వివిధశాఖలకు సంబంధించి 328 పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి యుద్ధప్రాతిపదికన పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, డీఆర్వో ఎం.రాజేశ్వరి, జడ్పీ సీఈవో వినోద్, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్వహణ మెరుగ్గా ఉండాలి

జిల్లాలోని ప్రభుత్వ గురుకులాలు, వసతిగృహాల నిర్వహణ మెరుగ్గా చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమశాఖల అధికారులు, ఆర్సీవోలు, వసతిగృహ, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత, వసతి, భోజన సదుపాయాల్లో ఎక్కడ లోపాలు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. వసతిగృహాలు, గురుకులాల్లో గతంలో మిగిలిన కిరాణా సరుకులు తీసి, తాజా సరుకులు వాడాలని తెలిపారు. మెనూ కచ్చితంగా పాటించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, కూరలు, పండ్లు, గుడ్లు అందజేయాలన్నారు. నాణ్యతా లోపాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. త్వరలోనే కలెక్టర్, అదనపు కలెక్టర్లు తనిఖీలు చేపడతారని, నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ సమీక్షలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, సంక్షేమశాఖల ఆర్సీవోలు, వసతిగృహాలు, గురుకులాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి నైనీ ప్రాజెక్టుకు పూర్తి సహకారం

- త్వరలోనే అటవీభూమి బదలాయింపునకు చర్యలు
- ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సింగరేణి సీఎండీ భేటీ

ఒడిశా ప్రధాన కార్యదర్శితో మాట్లాడుతున్న సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, జూన్ 24 : సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో చేపట్టిన నైనీ బొగ్గు గని నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం చివరినాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యే విధంగా, అలాగే నైనీ సమీపంలో నిర్మించతలపెట్టిన థర్మల్‌ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయింపు కోసం సంస్థ సీఎండీ బలరాం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందుకోసం సోమవారం ఆయన ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ జైన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నైనీ బ్లాక్‌కు సంబంధించి అన్ని అనుమతులు లభించిన విషయాన్ని, రెండో దశ అటవీ అనుమతుల్లో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా సింగరేణి చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా వన్యప్రాణి సంరక్షణ ప్రణాళికలో పొందుపర్చినట్లుగా రూ.39 కోట్లను కూడా డిపాజిట్ చేశామని, దీంతో ఇప్పటివరకు రూ.180 కోట్లు పూర్తిగా ప్రభుత్వానికి చెల్లించినట్లు వెల్లడించారు. ఆయన వెంట నైనీ జీఎం శ్రీనివాసరావు, జీఎం ఎస్టేట్స్ బండి వెంకటయ్య, చీఫ్ ఆఫ్ పవర్ ప్రాజెక్ట్స్ విశ్వనాథరాజు, ప్రాజెక్టు ఆఫీసర్ మజుందార్, ప్రవీణ్ కశ్యప్ ఉన్నారు.

11 నుంచి గిరిజన ఉత్పత్తుల ఎంపిక

భద్రాచలం, జూన్ 24 : గిరిజనులు తయారు చేసిన హస్తకళల ఉత్పత్తులు, వీడీవీకే, అటవీ, చేనేత ఉత్పత్తుల ఎంపిక కార్యక్రమాన్ని వచ్చే నెల 11న ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో నిర్వహించనున్నట్లు భద్రాద్రి కలెక్టర్, ఇన్‌చార్జి పీవో జితేశ్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన ఉత్పత్తులకు వెంటనే ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్(ట్రైఫెడ్) ద్వారా ధర చెల్లించి వాటిని దేశవ్యాప్తంగా ఉన్న ట్రైఫెడ్ కేంద్రాల ద్వారా విక్రయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన గిరిజన ఉత్పత్తిదారులకు రవాణా ఖర్చులు చెల్లిస్తామని, 50 కిలోమీటర్ల దూరంలోపు వారికి ఒక్కొక్కరికి రూ.350, 50 కిలోమీటర్ల పైబడిన వారికి రూ.500 చొప్పున చెల్లిస్తామని తెలిపారు. అలాగే గిరిజన వ్యాపారులకు భోజన సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన గిరిజన ఉత్పత్తిదారులు మాత్రమే తమ ఉత్పత్తుల నమూనాలతో జూలై 11న ఉదయం 10 గంటలకు భద్రాచలంలోని గిరిజన భవన్‌కు తమ కుల ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డులతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాల కోసం 9705499248, 9848522841, 7794921516 నెంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.